# గతుకులు



ఇన్నాళ్ళూ నాలుగు బియ్యపు గింజలో ధాన్యపు గింజలో పడితే ఆ ఇంటి ముందు కోళ్ళేరుకొనేవి. కానీ ఇప్పుడు నాలుగ్గింజలు పడితే కోళ్ళు కన్నా ముందు కన్నప్పడు ఏరుకుంటున్నాడు. 'లచ్చిమీ తల్లీ 'అని కళ్ళకద్దుకుని ' కళ్ళువుపడవా' అని ఇంట్లోకి కేక పెట్టి యజమాన్నని నిరూపించుకుంటున్నాడు. ఇప్పుడూ అదే పనిలో వుండి చేటలో నుండి జారిపడి బుగ్గిపాలయిన నాలుగు గింజల్నీ కోడిలాగ కళ్ళొట్టుకొని ఏరాడు. అసలు కాలమే మారిపోయింది. అందుకనే తన బతుకూ మారిపోయిందనుకుంటాడు అప్పుడు.

కన్నప్పడిని కనొదిలేసి, రెండెకరాల భూమ్మాత్రం ఇచ్చి ఎళ్ళిపోయారు అతడి తలిదండ్రులు. నలుగురు కూతుర్లను గన్న తాను అది నిలుపుకోవడానికి నానా జెంజాటూ పడిపోయేడు. ఇప్పుడిద్దరు కూతుర్లకీ పెళ్ళి చేసేసాడు. మరో కూతురుకి ఈమధ్యే సంబంధాలు చూస్తున్నాడు. ప్రస్తుతం ఎకరా భూమే మిగిలింది. అయినా ఎకరాకి ఎన్ని గరిసెలు పండుతాయని? ఆ పంట ఏడాది పొడువునా ఎలా వస్తుంది? బత్తెము వెచ్చముకే చాలదు. పైగా చుట్టాలూ వచ్చిపోయే వాళ్ళూ... సాకలి కర్సూ, మంగలి కర్సూ... కూర కర్సూ... ఇవన్నీ ఎలాగో తంటాలు పడ్డా పొయ్యి మీదకుంటే కిందకుండదు. పొయ్యి కిందకుంటే పొయ్యి మీద కుండదు. అందుకే కన్నప్పడు కూలి పనికెళ్తాడు. నుయ్యి తవ్వుతాడు, పునాదులు తీస్తాడు. సొప్ప కొడతాడు. మట్టి పనికెళ్తాడు. ఒకటని ఏటి, అన్ని పనులూ చేస్తాడు. మరి కన్నప్పడుతోపాటు ఆడి పెళ్ళాం వరాలు గొప్పు తవ్వటానికి ...గాబు తీతకి ... ఎగరబోతకీ... చేనుకోతలకీ అన్నిటికీ బయలుదేరుతుంది. అదీ చాలదని తమ ఇద్దరి కూతుర్లనీ ఎంటేసుకు ఎల్తుంది. ఎకరా పంట పనులకు ఇంటిల్లిపాదీ కష్టపడతారు. అలా అయితేనేగానీ ఈదుకు రాలేక పోతున్నారు అన్న ఆలోచన వారికేనాడూరాలేదు.

''బియ్యమేరినావుగావాలా, అందులో దొరికిన దాన్నెపు గింజలు సెంబుతో

సిదుపుతానుగానీ... కూరేదన్నా పట్రామి ... నువ్వూ నేనూ అయితే పరవాలేదు. పెద్దమ్మి కూడా వచ్చింది కదా... ఎళ్ళు'' అంది వరాలు.

భార్య మాట విని అక్కడ నుండి నడిచాడు కన్నప్పడు. పెద్దమ్మి మళ్ళీ వచ్చింది. పెళ్ళి సెయ్యడాకే సచ్చీసెడీ ఒకొడ్డు కొస్తుండే... ఈ పురుడులూ పున్నేలూ నావల్ల కాదు' అనుకున్నాడు. కానీ కూతురు ఏడుపు గుర్తొచ్చి కడుపు కరిగి పోయింది. ' అదేటో ఎదవ దురదుష్టం కాపోతే దానికీ ముగ్గురూ ఆడపిల్లలే. నాలుగో పురిటికి వచ్చిందిప్పుడు. ఈసారన్నా మొగపిల్లాడు పుడితే బాగున్ను' అనుకున్నాడు. 'ఎవరయితే ఏంలే' అంతలోనే మరేం గుర్తుకొచ్చిందో పెదవి విరిచాడు.

చెవ్విరక నుండి ఆరిపోయిన చుట్ట తీసి వెలిగించి రెండు గుక్కిళ్ళు లాగి, తాగాలని వున్నా మళ్ళీ ఆర్పేశాడు. కన్నప్పడికి చుట్టంటే ప్రాణం. ఆ అలవాటు ఈ నాటిది కాదు. తాతల తండ్రుల నాటిది. తన తండ్రీ తనూ కలసి మణుగులకు మణుగులు పొగాకు ఎండబెట్టి బాగు చేసి సంవత్సరానికి సరిపడినట్టూ నిలవావుంచుకొని... ఊసుపోక పోయినప్పుడల్లా ఆ కట్టలు దించి చుట్టలు చుట్టేవారు. అని ఎక్కువ తాగటం మూలాన్నే తన తండ్రి వేగిరం చచ్చిపొయ్యాడని అందరూ అంటారు.

'' అప్పుడు రూపాయిస్తే మణుగుడు పొగాకు... ఇప్పుడో, నాలుగు సుట్టలే రావు '' అనుకున్నాడు. అంతలోనే కన్నప్పడికి ఆయన తాత గుర్తొచ్చేడు. తాత మాటలుగురుతొచ్చేవి. '' పావలా ఇస్తే పట్టు సీరొచ్చేదట. అద్దురూపాయికి ఆవును కొనుక్కోవచ్చుట! అమ్మో... ఆ కాలమొస్తే బావుణ్ణు '' అనుకున్నాడు. అయితే ఉప్పుడు కూలి డబ్బులూ పెరిగాయి. అన్నిటి మీదా రేటులూ పెరిగాయి. కానీ రేటులు పెరిగినంతగా కూలి డబ్బులు పెరగలేదు అని అనుకున్నాడు.

కన్నప్పడు బడ్డీ ముందాగాడు. అప్పుడు కన్నప్పడికి కళ్ళకెదురుగా షాపు... సామాన్లూ... బడ్డీవాడి నగల భార్య... ఏమీ కనిపించలేదు. బడ్డీ కృష్ణమూర్తి జిగజిగల బంగారపు రంగు చొక్కా కూడా కనిపించలేదు. కళ్ళంలా తయారయిన పట్ట (బట్ట) తలా కనిపించలేదు. కనిపించిందల్లా ఒక్కటే... చింకి పాత కట్టుకొని సేగోడీలు సుప్పులు జంతికలు అమ్ముకొనే కిష్టిగాడు. అపుడంతా ' ఒరే కిష్టా... కిష్టిగా ' అని వాడిని పిలిచేవారు. అప్పుడు వాడెంతో మర్యాదగా మాట్లాడేవాడు. జవాబు చెప్పేటప్పుడు బితుకుగా చేతులు కట్టుకొనేవాడు...' ఇదంతా తలపుకు రావడంతో నవ్వొచ్చింది అప్పడికి.

'' ఏట్రా... అప్పుడూ... ఏటి బాకీ డబ్బులివ్వడానికొచ్చావా? '' కృష్ణమూర్తి అడిగాడు.

''ఏమండీ'' అని సంబోధించేవాడు తప్ప ఎప్పుడూ పేరు పెట్టి పిలవడానికే జంకే కిష్టిగాడు ఇప్పుడు ఏకవచన ప్రయోగం చేస్తూ అప్పడ్ని పిలవడంతో అప్పడు ఆశ్చర్యపడలేదు, ఆలోచనకు గురయ్యాడంతే. '' ఒకప్పుడు ఆడి స్థానంలోకి నే

వెళ్ళిపోయాను... అందుకే'' అని నిట్టూర్చాడు.

'' పలకవేటి బికీ సొమ్ము కడతన్నావా? ఆ మధ్య కూతురు సమర్తాడిందని నాలుగొందలొట్టికెళ్ళావు. దానికి వొడ్డీ లేదు మొదులూలేదు. ఆ సమర్తాడిన కూతురికీ పెళ్ళయిపోయి పురిటికొచ్చినా నువ్వు తీర్చినట్టు లేవు. సెత్తి మాల్నోడివి... గతిలేనోడివి ఏనికి పట్టికెళ్ళాల పౌరుషం వుంటే పడెయ్యి'' కృష్ణమూర్తి మాటలు- అవి మాటలు కాదు, అరుపులు...తిట్లు... కొరడా దెబ్బలు!

కన్నప్పడు కిక్కురు మనలేదు. తన చెయ్యి రాయికిందున్నట్లుగా అనిపించింది. చెయ్యి కదిపితే తనకే కష్టం. పెదవి విప్పితే తనకే నష్టం. అందుకే మరేమీ అనలేదు.

''... ఇచ్చేస్తాను... ఈ నెల... ఎలాగయినా సూసి...'' అని మౌనంగా తల దించుకుని అక్కడి నుండి కళ్ళం మడివేపు వెళ్ళాడు కన్నప్పడు.

రెండేళ్ళు కళ్ళంలో వదిలేసిన నాటుబండి వర్షానికి తడిసిపోయి బాగా మురిసిపోయి మన్ను తినేస్తోంది. అది చూసి కన్నప్పడికి ఏడుపొచ్చింది. తన జోడెడ్లు గుర్తుకొచ్చాయి. ఆ ఎడ్ల బండి మీద తను కూర్చొని ' ధా...ధ...దదధ' అని అదిలిస్తూ తోక పట్టుకుంటే పది నిముషాల్లో పదామడలు చుట్టబెట్టి వచ్చేవి. వాటి మెడలోని మువ్వలు అమ్మోరు సంబరాల డప్పుల మోతలా వుండేవి. అలాంటిది అవి కూడా కూతురు పెళ్ళికి భోజనాలు పెట్టినపుడు అమ్మేశాడు. ఆ రోజు తనకయితే అన్నమే సయించలేదు. అవి కూడా వెళ్ళే ముందర చూసిన చూపు ఇప్పటికీ అగుపిస్తోంది.

మళ్ళీ ఎడ్లను కొందామనే బండి అమ్మలేదు. ఈ లోగా ఒక దానిమీదొకటి కర్సూ... కరమత్తూ వచ్చి పడ్డాయి. ఎడ్లు కొనలేదు కదా బండి కూడా ఇప్పుడు మట్లో కలిసి పోవడం... మనిషి పుట్టి పెరిగి మట్లో కలిసిపోయినట్లుగా తోస్తోంది అప్పడికి.

'' ఏటయ్యా కూరట్టుకు రమ్మంటే ఇక్కడ కూకున్నావు'' ఆశ్చర్యంగా మొగం పెట్టి పిడకల కుచ్చిరి దగ్గరకు వచ్చిన వరాలు అడిగింది. జవాబివ్వలేదు గానీ పెళ్ళాం వైపు తల ఎత్తి చూసాడు.

కన్నప్పడు కళ్ళముందు గతం మబ్బులా కదిలింది. అప్పుడెలా వుండేది వరాలు! నిజంగా వరాలు వరాల మూటే అని పిల్లని చూసొచ్చి ఆనాడే అమ్మ అంది, అవును వరాలు తనని కట్టుకోబట్టి ఇలా అయిపోనాది గానీ అది రాజింటి బిడ్డ. వయసులో ఎల్లా వుండేది? దుబ్బుగా జాకిట్లు ఏసుకుంటే సెయ్యెత్తితే పరపరా సిరిగిపోయేవి. అంత కండ పట్టిన గట్టోళ్ళు.. కానీ వరాలు జాకెట్టు ఏసుకోడ మెరుగదు. అసలాకాలంలో అందరూ జాకెట్లు లేకుండానే సీర మా సక్కగా కట్టుకొనీ వోళ్ళు. పెళ్ళయిన కొత్తలో అందరూ ఏసుకోమంతే వరాలు జాకెట్టు ఏసుకుంది కొన్నాళ్ళు. గానీ ఎంత సిగ్గుబడిపోయిందనీ, అసలు తమ పెళ్ళయిన మొదట్లో తను కళ్ళం కొస్తే కూడెట్టుకొచ్చే నెపం మీద పనుల్లో కొచ్చే మనుషుల సేత పంపకుండా తనే వచ్చేది. పిడకలకని కుచ్చిరి

దగ్గరకు వచ్చేది. కొంటెగా చూసేది. అప్పుడు తాను మాత్రం ఒగ్గోడా? గభీమనెళ్ళి గడ్డి కుప్ప మీదకు తోసేసి మరీ ఎన్ని ముద్దులు పెట్టోడు? ఎన్నిసార్లు తెల్ల లాల్చీమీద ఎర్రటి, నల్లటి మరకలవలేదు? అవి చూసి వరాలు ఎన్నిసార్లు మురిసిపోలేదు. అది తెలియక, పైనుండి ఇంటికి వచ్చి నతన్ను చూసి అమ్మకు ఎన్నిసార్లు అనుమానం రాలేదు...?!

'' నీకే ! ఏటాలోసిత్తన్నావ్ '' వరాలు అప్పుడ్ని కుదిపేసింది.

ఆ... అన్నాడు అప్పుడు నిద్రలోంచి లేచినట్టు.

'' ఈ పూటకు ఆ షావుకారి కాడ దేనికిగానీ ఆ టమాట్లు, సిక్కుడు కాయలు నాలుగేరి పట్రా. మద్దేనం ఏలకి మళ్ళీ మీకు తిండి అమర్సాల...'' అంటూ వెళ్ళి పోయింది వరాలు.

అప్పుడు మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

...అన్నిట్లోనూ ఎంత మార్పు...చివరకి మొగుడూ పెళ్ళాల బాంధవ్యం దగ్గర కూడా. ఇప్పుడు ఇద్దరూ ఏకాంతంగా కలిసే సమయమే దొరకదు. అధవా దొరికినా వాళ్ళిద్దరి కౌగిళ్ళుండవు. పకపకలుండవు. పట్టుకోడాలుండవు... కొంటెతనాలుండవు...వుండేదల్లా కృష్ణమూర్తి... పిల్లల పెళ్ళి... వాళ్ళ కాపురాలు... వాళ్ళ జీవితాలు ఇవే. కూలిపని మరో నాల్రోజులు దొరికితే అన్న ఆశే ఇద్దరికీ! వరాలు అవే మాట్లాడుతుంది. తానూ అదే మాట్లాడతాడు. ఏమిటో ఆలోచించినా అర్థం కాదు అప్పడికి. అప్పుడప్పుడు అందుకేనేమో జీవితం మీద రోత కలుగుతుంది. 'మానవ జన్మ ఉత్తమమైంది' అంటారెందుకో', ప్రశ్నించుకున్నాడు అప్పడు.

... ఏది ఏమి జరిగినా రోజుకు మూడు పూటలు తినాలి. తన పిన్నవయసప్పుడయితే అయిదుసార్లు అంటే అలబొద్దు... తెల్లారగట్ల తినేవాడు. నాలిక మీదకు ఏదో కూరాకుండాలి. మొగుడికి పెళ్ళమున్నట్టు... అన్నముంటే సాల్దు కూర కావాలి. అప్పుడు సుట్టుమొస్తేగొర్రెపోతునే ఏసేవాళ్ళు. ఇప్పుడు కోడయినా కొయ్యడం లేదు. ఆ కోడినమ్మితే పాలికో పరకో వస్తే కూతురికి సీర కొనెయ్యొచ్చు.. లేదంటే అల్లుడు అనరాని మాటలు అన్నా అంటాడు.

అపడు అక్కడి నుండి లేచి నిలబడ్డాడు.

చిక్కుడు కాయలు, టమాటోలు ఏరి తువ్వాలులో కట్టి ఇంటికి తీస్కెళ్ళాడు. తరువాత స్నానం చేసి కూర్చున్నాడు.

పెద్ద మనమరాలు వెంకటి టీ తెచ్చి అప్పడి కిచ్చింది. అది టీ అంటే టీకాదు డికాషను. ఆ డికాషను తాగుతూ బ్రాందీ త్రాగినట్టుగా ఫీలవుతాడు అప్పడు. అప్పడు టీ తాగుతుంటే మౌనంగా నిలబడి చూసి చూసి ''మీ ఇంట్లో పాల్లేవా?'' అడిగింది. మనవరాలు.

కన్నప్పడికి ఏం చెప్పాలో తెలియలేదు.

''మా అమ్మ అన్నీ గొప్పలు చెప్పుతాది... 'మా ఇంట్లో జున్నుపాలు మీగడా' అని, మీకు టీలోకే పాల్లేవు అమ్మవన్నీ అబద్ధాలే....'' అంది మళ్లీ వెంకటి.

'' ఇప్పుడు లేవు అమ్మేసాం'' అని మనుమరాలితో అన్నాడు.

'' ఎందుకమ్మేసారు?'' మళ్ళీ ప్రశ్నించింది వెంకటి.

ఎలా చెప్పాలో అప్పడికి బోధపడలేదు. చెప్పినా చిన్న పిల్లకి అర్థం కాదనుకున్నాడు. కాని వరాలు పోరు మీద తను ఒకప్పుడు పాలేపారం చేసాడు చాన్నాళ్ళు. నాలుగ్గేదెలు, ఒక ఆవూ వుండేవి. ఆటికి తిండి పెట్టడమే కష్టమయిపోనాది. కరువొచ్చి పంట నేల్లన్నీ కాష్టం కల్లయిపోనాయి. పచ్చగరిక ఎక్కడా దొరకలేదు. ఎవరో బోరింగులున్నోళ్లకే అన్ని సదుపాయాలు. ఎండు గడ్డి ఏనాడో అయిపోయింది. పసగడుగు గంజీ ఇరుగూ పొరుగూ ఇచ్చిన మినప్పొట్టుతో ఎన్నాళ్ళు ఆటి దానా నింపగలడు? అందుకే అవి వట్టిపోయాయి. వట్టిపోయాక పెంచడం మరింక వల్ల కాలేదు. అప్పుడు వట్టిపోయినవని రేటు సరిగా రాలేదు గానీ అమ్మేసాడు. ఆనాటి బక్కలు, గొర్రెలు, కోళ్ళు ఒక్కొక్కటి అన్నీ పోయాయి.

''తాతయ్యా.. నువ్వేం పండిస్తావ్'' వెంకటి ప్రశ్నించింది.

వెంకటి తొమ్మిదో తరగతి చదువుతూ హాస్టల్లో వుంటోంది. తల్లిని చూద్దామని పించి సెలవులకు వచ్చింది. ఆలయ్య అంతకూ పట్టించుకోడు. ఆడ పిల్లకు దేనికీ సదువు? అనుకున్నాడు గానీ తిండెడతారని సదువుకోమని పంపేసాడు. ఏది ఏమయినా వెంకటి ఆల్ల కుటుంబంలో తెలివయిందంటారు. అందుకే గావాల బోలెడన్ని ప్రశ్నలేస్తుంది.

''ధాన్యం.. నువ్వులు.. సెలక్కాయలు అప్పుడప్పుడూ వర్షం పడితే'' చెప్పాడు అప్పడు.

''ధాన్యం అమ్ముతావా... బియ్యమా?''

''అమ్మడమేమిటీ?'' అర్థం కానట్లు ముఖం పెట్టాడు అప్పుడు.

''పండించిన వన్నీ మనింటికేనా?'' మనుమరాలు.

''మిగలవు'' పైకి అన్నాడు. పంటంతా ఇంటికే చాలదు. కాని అవసరాలకి అమ్మేసి తరువాత కూలి డబ్బుల్తో కొనుక్కోడానికి నానా యమయాతనా పడిపోతాడు. ఇవన్నీ చిన్న పిల్లకు అర్థం కావని చెప్పలేదు అప్పడు.

'' మొన్న అమ్మమ్మ'' నువ్వూ ధాన్యం అమ్మేరు నే చూసా'' అంది మనుమరాలు.

'' ఆ అమ్మాను. అయితేటంటావు?'' అడిగాడు గాని, 'అవన్నీ నీకెందుకు' అని అనలేదు. ఎందుకంటే మనుమరాలు మాట్లాడుతుంటే ముద్దనిపిస్తోంది.

''తాతయ్యా ఒకటడగనా?''

''వందడుగు'' అన్నాడేకాని అప్పడి గుండె కొట్టుకుంది. 'పైసలడిగితే?' తన దగ్గర చిల్లిగవ్వ కూడా లేదే... అప్పడు బాధపడిపోయాడు.

అప్పడనుకున్నట్లు వెంకటి డబ్బులడగలేదు.

''తాతయ్యా ధాన్యం నీకు వచ్చిన రేటుకి అమ్ముతావా? ఎలాగమ్ముతావు'' వెంకటి ప్రశ్న అప్పడికి ఆశ్చర్యం కలిగించింది. పెద్ద ప్రశ్న? ఎంతయినా చదువుకుంటోంది గదా! అనుకున్నాడు మనసులోనే.

''సెప్పు''

''మనిష్టమొచ్చినట్లెలాగమ్ముతాం'' అప్పడు చెప్పబోయాడు.

''అదేటి తాత నీళ్ళు కట్టి దున్ని అన్నీ చేసి కష్టపడి పండించింది నువ్వు? మరి నువ్వు పండించింది నీ ఇష్టం కాదా?'' కాస్సేపు అప్పడికి ఏం చెప్పాలో తెలియక నోరావులించాడు.

''... ఎందుకంటే తాతా, సుప్పులు జంతికలు చేసిన వోళ్లే దానికి ఒక రేటు పెడతారు కదా! మనకి బల్లల పెట్టి చేసి అమ్మిన షరాబు పెట్టి రేటు ఆడే ఇమ్మన్నాడు కదా'' వెంకటి ఏదో ఆలోచిస్తూ అంది.

ఇప్పుడు అప్పడిలో ఆలోచన మొదలయింది.

నిజమే... నిజమే.. సామాన్లు చేసి అమ్మి నోళ్లే ఆళ్ళిష్టమొచ్చిన రేటు అన్నీ సూసుకొని మరీ ఎడతారు. కాని తమ రైతులు పండించే పంటకు ఎవడో వచ్చిరేట్లు నిర్ణయిస్తాడు. ఆడు సెప్పిన రేటుల అమ్మాల తాము పండించే పంటకు ఏ నాయకులో వచ్చి రేటెట్టడం ఆశ్చర్యంగానే తోచింది. అప్పడికి.

అప్పడి ఆలోచనలు మరింత వేగంగా పరుగెత్తుతున్నాయి.

''యూరియా గట్రా తయారు చేసిన ఫ్యాక్టరీ వాళ్ళే దానికో రేటెట్టి ఆల్ల ఇష్టానికి అమ్ముతారు. సిలవరి.. రాగి... స్టీలు... ఇత్తడి సామానులు తయారు సేసినోడే తనిష్టమొచ్చిన రేటు లాభాన్ని సూసుకొని మరీ అమ్ముతాడు. ఏ ఫ్యాక్టరీ వోళ్లయినా తాము తయారు సేసిన వాటికి తామే రేటు నిర్ణయం సేత్తారు. మా రైతుల కాడికి వచ్చేసరికి మాత్రం అందుకు ఇరుద్ధం...

అయితే ఏటి సెయ్యాలా?

తమ పంటకు గిట్టుబాటు రేటు తామే ఎట్టుకోవాల... అంటే అలా జరగాలంటే రైతులందరూ ఒక్కటిగా వుండాలి. ఏదో అర్థమయిన వాడిలా అప్పడు అక్కడి నుండి లేచి వెళ్ళి అందరు రైతుల్ని కూడదీసి చెప్పాడు.

మొదట కొందరు నవ్వారు. తరువాత ఆలోచించారు ''అలా సెయ్యడం కష్టమేమో?'' అనుమానం కొందరు కక్కేసారు.

''మనమంతా ఒక రేటుకే అమ్మాల. ఏ వస్తువు తయారు సేసినోడు ఆ వస్తువు

అమ్ముకోగా లేంది... మనం కష్టపడ్డది అమ్ముకోడంలో ఆశించడంలో అన్యాయమేముంది?'' అన్నాడు అప్పుడు.

''అయినా మనం అమ్మేటన్ని పండిత్తన్నా మ(్రా... మనమేం పెద్ద రయితులమా మనకే మనం పండించింది సాలదు'' అన్నాడు ఇంకో రైతు. ''అలాగని అవసరాలకి అమ్మడం మానేత్తన్నామా? ఆ అమ్మేదేదో మనకి కిట్టినట్టు అమ్మాలనీ'' ఇంకో రైతు సర్దేడు.

''మనమిప్పుడు పుట్టి ఎనబై రూపాయిల కమ్మేత్తాం. కొనేసరికి నూటెనబై లెక్కయినా కావాల. 'అమ్మబోతోటికి అడవి... కొనబోతోటికి కొరివి' అని ఒత్తినే అన్నారా'' మరోచిన్న రైతు అన్నాడు.

'' ఈ డబ్బున్న మా రాజులు మన దగ్గరిప్పుడు పంట రాగానే కొనేసుకొనే ఆళ గాదులూ... కొట్లూ అన్నీ నింపుకుంటారు. లారీలతో ఎత్తికెళ్ళి పోతారు. మనం మళ్ళీ బియ్యం కొంటే కేజీ ఆ(్రూపాయలంటారు'' నిట్టూర్చాడు రైతు.

అయితే ఎన్ని కష్టాలొచ్చినా అనుకున్న రేటుకే అంతా అమ్మాలని, అదీ రేటు పలికేకనే అమ్మాలని నిర్ణయానికొచ్చారు అంతా. తరువాత ఎవరిళ్ళకు వారెల్లిపోయారు.

కన్నప్పడికి కడుపు నిండా తిన్నట్టుగా తృప్తిగా వుంది. మనసులోనే మనుమరాల్ని అభినందించేడు. పెళ్ళాం ఇంటికెళ్ళగానే కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిచ్చి భోజనం వడ్డించింది. అప్పుడు భోజనం ముందర కూర్చున్నాడు. రెండు ముద్దలెట్టాడో లేదో ''అమ్మా... అమ్మా...'' అరుపులు. కూతురు నొప్పులు పడుతున్నట్టుగా వుంది.

అప్పడు గాబరా పడుతూ ''డాకటేరు బావుదగ్గరికి తీసుకెల్దామేటి?'' పెళ్ళాన్ని అడిగాడు.

''ఏనికి.. ఎవల్దగ్గర డబ్బులు మొలుస్తున్నాయి మన రాజమ్మ మంత్రసానికి కబురెట్టినా వస్తుంది''. భార్య మాటకు తన దగ్గర డబ్బులుంటే ఎదురు చెప్పేవాడే కాని అవి లేకపోవడంతో మౌనంగా తిని దిక్కుతోచక అలవాటుగా పొలంవేపు నడిచాడు. ఎండ కాస్తున్నా లెక్క చేయకుండా చేనంత గాలించాడు. ఏదో పురుగు పట్టినట్టుంది. అప్పడికి భయం వేసింది. ఆశల మీద నిరాశ నీడ పడడంతో వెన్నులో వణుకు పుట్టింది. వరి వెన్నేసేటప్పుడే ఈ తెగులు రావడంతో అప్పడిలో గుబులెక్కువైంది. పొలమంతా అదేమాదిరిగా వుంది. అంతే... అప్పడికి కళ్లలో నీళ్ళు తిరిగాయి.

కాసేపు చూసాక కాళ్ళు ఎకాఎకిన పొరుగింటి పోతరాజును కలవడానికి వడివడిగా పడ్డాయి. అయితే ఎదురుగా నిలబడే పోతరాజుని చూసి విషయం చెప్పాడు. పోతరాజు కాస్తో కూస్తో చదువుకున్నోడని అందరూ అయన్నే అడుగుతారు.

అప్పడు చెప్పకుండానే ఏడ్చేసినంత పనిచేశాడు. పోతరాజుకి విషయం అర్ధమయినట్లుంది. అప్పడి భుజం మీద చెయ్యేసి ''మరేం దిగులు పడకు... నానే

సూసి నీకు సెపుదామనుకున్నాను. ఈలోపు నీవే సూసినావు. ఇప్పుడు ఎంటనే మందులు పట్నం నుంచి తెప్పించి జల్లకపోతే ఎన్నంతా ఏళబడిపోద్ది... ఈ సీడకి ఒక్క గింజా మిగలదు'' చెప్పాడు.

''మందులు ఎంతవుతాయి'' అప్పుడు ఆత్రంగా అడిగేడు.

''మూడొందలవొచ్చు...'' పోతరాజు మాట పూర్తి కాలేదు. అక్కడి నుండి అప్పుడు ఇంటివేపు పరుగు తీశాడు. డబ్బులిప్పుడెక్కడ దొరుకుతాయి? నా నోటి మీద కూరాకు నిలబడుతుందా? అంత డబ్బు ఎలా? మెదడ్ని దొలిచేస్తోంది.

అసలు అప్పడికి ఊష్టమొచ్చినా (జ్వరం వచ్చినా) ఆస్పెట్లకి ఎళ్ళి ఎరగడు. ఇంట్లో ఎంతో ఇదయితేగాని తీసికెళ్లడు. కషాయం... ఇదీ అదీ అని కాలం గడిపేస్తాడు. కానీ పంటకింత రవ్వపీడొచ్చినా తట్టుకోలేదు. పేణం గిలగిల మంటాది.

ఇల్లు చేరేసరికి ఇంటి ముందు అమ్మలక్కలు గుమికూడున్నారు.

కన్నప్పడి గుండె మరింత వేగంగా కొట్టుకుంటూండగా ''ఏటయ్యింది'' అడిగాడు.

''...నీ పెద్ద కూతురు కడుపులో బిడ్డ అడ్డం తిరిగి పోనాది. రాజమ్మ తన వల్ల కాదనీసింది. పట్నం పెద్దాసపెట్లికి తీసుకెళ్ళాల'' పొరుగింటి పోతరాజు భార్య పోలమ్మ చెప్పింది.

అంతే అప్పడికి కాళ్ళూ సేతులూ ఆడలేదు. అమ్మోరమ్మకి బలిచ్చేముందు డప్పుల మోతకు బెదిరిపోయిన పోతులా అటూ ఇటూ చూసాడు. భయం వళ్ళంతా ఆవరించుకుపోయింది. అక్కడ పొలం ఏడాది పొడుగూ పెట్టుకున్న ఆశలూ బతకాల్సిన బతుకూ వున్న ఒక్క ఆధారం... జారిపోతున్నట్టు అనిపించింది.

''...ఏటి పెద్దోడో, మగ మనిషివి నీవే అలా అయిపోతే పెళ్ళం... పిల్లలు అందులోట ఆడ కూతుర్లేమవుతారు? ముందా పిల్లని ఆస్పెట్లకి తీసుకెళ్ళే మారగం సూడండి'' ఓ ముసలమ్మ అప్పడి చెయ్యి పట్టుకుని వెళ్ళమన్నట్టు తోసింది.

అప్పడి మిత్తవోరయిన గౌరిగాడూ మాలచ్చిమీ రెండీదులవతల నుండి పరుగున వచ్చారు. వరాలు అందర్నీ చూసి మరింత ఏడుస్తోంది.

'' ఎవరో సచ్చినట్టు ఏమిటా ఏడుపు'' గౌరిగోడు కసిరాడు. అంతలోనే నాటుబండి సిద్ధం చేసి ఎవులివో ఎడ్లను తెచ్చి కట్టారు. బండి మీద ఎండుగడ్డి పరిసి దాని మీద గోనేసి పైనేమో సింకి గుడ్డపాత, ఓపాత చీరతెచ్చి ఏశారు. అప్పడి పెద్ద కూతుర్ని అందులో ఎక్కించి మరో ఇద్దరు ఆడాళ్ళు ఎక్కారు.

''నువ్వు డబ్బులు గట్రా సజ్జు సుసుకొనిరారో అప్పడూ, నేనెల్లి ఆస్పెట్లో జాయినింగు సేసేస్తా. దానికేం ఫరవాలేదులే నేవెళ్తున్నాను. వోలే వరాలప్ప నువ్విక ఏడక ఆ సిన్న పిల్లలు, మీ మనుమరాలు మరీ జడుసుకుంటారు'' అంటూ బండి తోలాడు గౌరిగోడు. బండి క్షణాల్లో చూస్తుండగానే ఆ ఊరి పొలిమేరలు దాటేసింది.

అప్పడు అరుగరుగు తిరిగాడు. అంతా తనలాటోళ్ళే. ఆళ్ళు ఆదుకుందామనుకున్నా ఆదుకో లేరు. అప్పులిచ్చేవోళ్ళకి తనఖా పెట్టాల అంటే నమ్మకం పోయింది. మనుషుల మీద మనుషులకే నమ్మకం పోయినందుకు అప్పడు తిట్టుకున్నాడు.

వరాలు '' ఏటి తనకా పెట్టడమా?'' అని ఆలోచిస్తోంది. ''మామ సచ్చిపోతే కాళ్ళకడేలు అమ్మి సమయానికి కతా కార్యం సేనా బాగాసేసినాం'' అనుకున్నారు. ఉన్న సెవికమ్మెలు, ముక్కు బేసరీలకీ అలాగే అయింది. రెండో కూతురికి పెళ్ళి చేసి పడమటివైపిచ్చినారు. ఆలంతా పత్తి పండించేవోళ్ళు. పత్తి ఏటి తింటారాల్లు... గింజలైతే గెంజన్నా తాగీవోళ్ళు. ఆలకి సేనా కష్టాలొచ్చి పడిపోనాయి. ఎందరో ఆలూర్లో ఆకలికి బరాయించలేక బలిమిన సచ్చిపోనారు. ఉరి తీసుకున్నారు. విషం తాగేనారు. మలమల మాడి సచ్చిపోనారు. అలాటప్పుడు అల్లుడు కూతురూ ఏ గంగలో కలిస్తే కలవనీ అని ఎలా వదిలేస్తామని కమ్మెలు బేసరీలు అమ్మి చిన్న కొట్టు ఎట్టుకోమని డబ్బిచ్చినారు. గోరు సుట్టుమీద రోకలిపోటులా ఒకదానికి కొకటి పడుతుంటే ఏ మనుషులు మాత్రం ఎత్తురుతారు? ఏ బతుకులు మాత్రం బాగుపడతాయి? రెండెకరాల పొలం అంతమంది ఆదారమున్నూ. ఎట్నుంచీ పైసా వచ్చిన రాబడీ లేదు. ఏ పూట కష్టపడితే అది ఆ పూటకే!

అప్పడు కాలు కాలిన పిల్లిలా ఊరంతా తిరిగేసినాడు. ఆరోజు అప్పడింట్లో పొయ్యిలో పిల్లి పడుకుంది.

సాయంత్రానికి గౌరిగోడు ఒక్కడూ ఎడ్లు బండి తోలుకొని వచ్చాడు.

'' ఏమయింది'' వరాలు పరుగున వచ్చి అడిగింది.

''బిడ్డ అడ్డం తిరిగిందట. ఆపరేషను సేసి బిడ్డను తియ్యాలట. పెద్ద డాకటేర్లు వున్నారు. తల్లికి ప్రమాదం కాదులే అన్నారు. పీజులకి మందులకీ ఓ అయిదొందలు అందాకొట్టమన్నారు.'' గౌరి గోడు విషయం చెప్పాడు.

వరాలు ఏడుస్తూ ఇంట్లోకి పోయింది. అప్పడు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

'' ఏటి ఆలోసిత్తావు సీకటిపడతన్నాది డబ్బులు సూడు. ఇద్దరం పట్నమెల్లి డబ్బులు కడితేగానీ ఆపరేషను సేసేటట్టుగా లేరు.... ఇదిగో అదిగో అంతారు. కాలయాపన సేత్తారు. అది కడుపు నొప్పితో సచ్చిపోతుంటే మత్తు ఇంజీసను ఇచ్చారులే'' మళ్ళీ అన్నాడు గౌరిగోడు.

అప్పడికి ఏడుపొచ్చేసింది. ఆపుకోలేక పోయాడు. ఏడుస్తుంటే '' ఆడదానిలా ఏనికా ఏడుపు... ఏదో సూడు'' అంటున్నాడే గానీ గౌరి గోడికి కూడా అప్పడిని చూసి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

'రైతులకి రుణాల మాఫీ' సాయంత్రం రేడియోలో వస్తుంటే అది విని అంత ఏడుపులోనూ అప్పడికీ నవ్వొచ్చింది. రుణాలే మన దాక రానీరు. తీసుకుంటే కదా మాఫీ!

ఆ పెద్ద రైతులే.. పలుకుబడున్నోళ్ళే అన్నీ వుపయోగించుకుంటారు. ఆళ్ళకే బేంకోళ్లు అప్పులిత్తారు. వారయితే తీరుత్తారని నమ్మకమట. తామయితే తినీసి ఏరిగేస్తారని భయమట. హు... నిట్టూర్చాడు. ఎకరాసకరా భూమి గలోళ్లంతా ఏకమయ్యారు కాని అప్పడ్నీ ఆదుకోలేక పోయారు.

ఇదే అదననేమో అప్పుకెల్తే లేదని ఇప్పుడు ఇంటికొచ్చిన కృష్ణమూర్తి మాజీ కరణం మరికొందరు అన్నారు. ''అరే... అప్పడూ నీ పొలం ఈ ఏడాది పంట ఎంతయితే అంత... లాభమొచ్చినా, నష్టమొచ్చినా నాదే వెయ్యి... వెయ్యి రూపాయలిస్తాను. ఇచ్చే...''

ఆమాటలకు భూమి తన చుట్టూ తాను తిరగడం మానేసింది. కాని అప్పడి తల అంతకు రెట్టింపు వేగంతో తిరిగిపోసాగింది. నరాలు ఆలోచనతో చిట్లిపోతున్నాయి. అంతకన్నా గత్యంతరం లేదని అనిపిస్తోంది. కాని ఒక ఆలోచన అప్పుడికి అడ్డుపడుతోంది. అదే రైతులందరితోను తనన్న మాట. మనం కష్టపడ్డ పంటకు మనమే ధరెట్టుకోవాలి. అలా సెయ్యాలంటే అందరూ ఒక్కటిగా వుండి ఒకే రేటుకి అమ్మాల మరి.. ఇపుడు తనే మాట తప్పుతున్నాడు.

'' ఏటి ఆలోసిత్తన్నావు'' తోటి రైతులడిగారు.

'' ఎవడి కష్టాలకీ అవసరాలకీ వాడే ఒకడికి తెలీకుండా మరొకడు అమ్మేస్తూనే వున్నారు'' అన్న సంగతి వారి వారి అంతరాత్మలకి తెలుసు.

'' ఒప్పుకొని వెయ్యి తీసుకో'' సాటి రైతులు మళ్ళీ అన్నారు.

సరే అన్నట్టుగా తలూపాడు అప్పడు. వెంటనే చేతిలో వెయ్యి రూపాయలు పడ్డాయి. ''సంవత్సరమంతా ఎలా గడపాలి?'' అన్న తలంపుని గుండె లోపలే గొయ్యి తవ్వి పాతేస్తూ ''పద'' అన్నాడు గౌరి గాడితో. ఆ చీకట్లో ఎడ్ల బండి కదిలింది. ఊరుదాటింది. చిమ్మ చీకటయినా బండి వెళ్తూనేవుంది. ఆ చీకటి బతుకు చీకటి కంటే చిక్కనిదేం కాదు. అప్పుడప్పుడూ బండిని కుదిపేస్తున్న గతుకులు. తమని జీవితంలో కుదిపేసిన కష్టాల కంటే పెద్దవేం కావు. అందుకే అవేవీ పట్టించుకోకుండా బండెళ్ళిపోతున్నది..

రచనా కాలం : 30 మార్చి 1990,

ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, 1-6-90